


## కళాతపస్వి, సినీ యశస్వి

# కాశీనాథుని విశ్వనాథ్

### ఖమ్మం ఐఎంఏ హాల్‌లో కే.విశ్వనాథ్ సంస్మరణ సభ, ప్రముఖుల సంతాపం

వనం నాగయ్య, కెరటం న్యూస్

కళా తపస్వి సినీ యశస్విలా తెలుగు తెరపై కళాత్మక చిత్రాలకు సారదిగా, సినీ మాధ్యమం ద్వారా భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని విశ్వ వినువీధుల్లో రెపరెపలాడించిన కళాస్రష్టగా, తెలుగు కథకు సంగీత, సాహిత్య, నృత్య సొబగుల్ని అద్ది నవ్యపథంలో నడిపించిన దార్శనికుడు కాశీనాథుని విశ్వనాథ్ అని వనం కృష్ణవేణి, ప్రముఖ విద్యావేత్త, శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ దేవ్యాలయ కమిటీ చైర్మన్ మేళ్లచెర్వు వెంకటేశ్వరరావు, నాగబత్తిని రవి అన్నారు. ఖమ్మం నగరంలో ఐఎంఏ హాల్‌లో ఆదివారం ఇటీవల మరణించిన స్వర్గీయ కె విశ్వనాథ్ సంస్మృత, సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కే.విశ్వనాథ్ మరణం తీరని లోటన్నారు. ఎంతోమంది కళాకారులకు, సంగీత విధ్వాంసులకు మరియు గాయకులకు, కళాపోషకులకు మార్గదర్శమని అన్నారు. దివికి ఎగసిన కిరీటమని ఆయనకు ఖమ్మంతో చాలా అనుబంధం ఉందని సందర్భంగా పేర్కొన్నారు. ఆయనతో ఉన్న అనుభూతులను పంచు కున్నారు. అలాంటి గొప్ప వ్యక్తి మన మధ్యలో లేకపోవడం చాలా బాధాకరం అన్నారు. కళా తపస్వి సినీ యశస్విలా ఆయనకు గుర్తింపు ఉందన్నారు. తెలుగు తెరపై కళాత్మక చిత్రాలకు సారథి కె.విశ్వనాథ్. సినీ మాధ్యమం ద్వారా భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని విశ్వవినువీధుల్లో రెపరెపలాడించిన కళాస్రష్ట. తెలుగు కథకు సంగీత, సాహిత్య, నృత్య సొబగుల్ని అద్ది నవ్యపథంలో నడిపించిన దార్శనికుడని అన్నారు. విశ్వనాథ్ సినిమాల గురించి మాట్లాడుకోవడం అంటే మన సంస్కృతి, కళల్ని పునశ్చరణ చేసుకోవడమే. కె.విశ్వనాథ్ సృజించిన చిత్రాలు మన ఘనమైన సంప్రదాయాలు, కళలకు నిలువెత్తు ప్రతిబింబాలుగా విరాజిల్లు తున్నాయని అన్నారు. చక్కటి సామాజిక స్పృహ, మూర్తీభవించిన మానవతా విలువలతో తెలుగు సినిమాకు ఓ ప్రబంధ గౌరవాన్ని తీసుకొచ్చిన దిగ్దర్శకుడు కె.విశ్వనాథ్. తెలుగు సినీ చరిత్రలో ఆయనది సువర్ణాధ్యాయమని అన్నారు. సామాన్యుడు మాన్యుడిగా ఎదిగిన స్ఫూర్తిదాయక ప్రస్థానం. భౌతికంగా ఆయన మన నుంచి దూరమైనా కె. విశ్వనాథ్ సముపార్జించుకున్న కీర్తిప్రతిష్టలు ఆచంద్రతారార్కం ప్రభవిస్తూనే ఉంటాయని అన్నారు. ఆయన సినిమాల ద్వారా చాటిన విలువలు రాబోవు తరాల్ని కూడా ప్రభావితం చేస్తాయన్నారు. విశ్వనాథ్ స్వస్థలం గుంటూరు జిల్లా భట్టిప్రోలు మండలం పెదపులి వర్రు గ్రామం. ఆయన తల్లిదండ్రులు కాశీనాథుని సుబ్రహ్మణ్యం, సరస్వతమ్మ. విశ్వనాథ్ ప్రాథమిక విద్య స్వగ్రామంలో సాగింది. విజయవాడ గుంటూరు హిందూ కళాశాల, ఆంధ్రా క్రిస్టియన్ కళాశాలలో ఉన్నత విద్యను అభ్యసించారు. 1949లో బీఎస్సీ పూర్తిచేసిన అనంతరం ఉద్యోగ ప్రయత్నాలు మొదలు పెట్టారు. విశ్వనాథ్ తండ్రి విజయవాడ వాహిని సంస్థ సినీ పంపిణీ విభాగంలో పనిచేశారన్నారు. తండ్రి సలహాతో విశ్వనాథ్ చెన్నైలోని వాహిని స్టూడియోలో సౌండ్ రికార్డిస్ట్‌గా ఉద్యోగంలో చేరారు. 'తోడి కోడళ్లు' చిత్రానికి పనిచేస్తున్న సమయంలో దర్శకుడు ఆదుర్తి సుబ్బారావుతో పరిచయం ఏర్పడింది. ఆయన దగ్గర ఇద్దరు మిత్రులు, చదువుకునే అమ్మాయిలు, డాక్టర్ చక్రవర్తి వంటి చిత్రాలకు సహాయ దర్శకుడిగా పనిచేశారు. మూగ మనసులు, మరో ప్రపంచం, వంటి సినిమాల స్క్రిప్ట్ రూపకల్పనలో విశ్వనాథ్ సహకారం అందించారు. అనంతరం 'ఆత్మగౌరవం' (1965) చిత్రంతో దర్శకుడిగా అరంగేట్రం చేశారని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కడవెండి వేణుగోపాల్, ఖమ్మం చాంబర్ సెంట్రల్ ఈసీ సెంబర్ కొత్తమాసు హేమ సుందర్‌రావు, మాధవరావు, రమణ, సరస్వతి, శ్రీధర్, వనం తేజశ్రీ, నరేందర్ రెడ్డి, వివి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాశీనాథుని విశ్వనాథ్‌కు ఖమ్మం జిల్లాకు ఉన్న అనుబంధాన్ని ప్రముఖులు గుర్తుచేసుకుని ఘనంగా నివాళులు అర్పించారు.




